క్లుప్తంగా

బాబాకు ప్రత్యేక పూజలు



బాబాకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

ఓజిలి: మండలంలోని మానమాలలోని సాయి బాబా మందిరంలో బాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడా హారతి, పాలాభిషేకం అనంతరం విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. వెంకటగిరి పట్టణానికి చెందిన అరిగల ఆనందరావు, ఆయన సతీమణి బృందమాల, కుమారుడు భాస్కర్‌రావు అర్చన దంపతులు, కుమార్తె మాధురి, హర్షిత ఈ కార్యక్రమాలకు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం వారు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం దూఫ్‌హారతి, రాత్రి పల్లకిసేవ చేశారు.

ఘనంగా మండలాభిషేక పూజలు



పూజలు చేస్తున్న పండితులు

ఓజిలి: మండలంలోని బట్లకనుపూరు ఎస్టీకాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మండలాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు స్వామివారికి పాలు, తేనె, పన్నీరు, పాలాభిషేకం చేశారు. ఆలయంలో హోమం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వెంకన్న దర్శనానికి విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, గుడ్ల వెంకట్‌రెడ్డిని అర్చకులు సన్మానించారు.

భూసమస్యను పరిష్కరించండి

కోట: కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లెలో ఆక్రమణలకు గురైన ఎస్సీ, ఎస్టీల భూములను తక్షణమే వారికి అప్పగించాలని పలువురు దళితులు గురువారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 625లో 6 ఎకరాల మేరకు ప్రభుత్వ భూములను దళితులకు ఇచ్చారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి వారి ఆధీనంలో ఉన్న భూములను కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారన్నారు. ఆక్రమణదారుల చెరలో ఉన్న భూములను తిరిగి దళితులకు ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ఎంఈఓగా మస్తానయ్య బాధ్యతల స్వీకరణ



ఎంఈఓను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కోట: స్థానిక ఎంఈఓగా మస్తానయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన్ని కలసి అభినందనలు తెలిపి, సత్కరించారు. యూటీఎఫ్, బీటీఏ, పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

వందరోజులు పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పనులను వేగవంతం చేయాలన్నారు. మస్టర్ నమోదులో అవకతవకలు జరగకుండా చూడాలని ఏపీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉషారాణి, ఈసీ ఖలీల్ పాల్గొన్నారు.

24న గంధోత్సవం

గూడూరు: పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ రెహమతుల్లాహు అలై వారి గంధోత్సవం ఈ నెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రియాజ్ అహ్మద్, లయన్ షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం దర్గా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 24వ తేదీన జరిగే గంధోత్సవానికి పలు దర్గాల పీఠాధిపతులతో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి

డక్కిలి: ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని డక్కిలి, పాతనాలపాడు, దగ్గవోలు గ్రామాల్లో ఆర్బీకేలు, హెల్త్‌సెంటర్ల భవనాల పనుల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాల నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని కాంట్రాక్ట్ ఏజెన్సీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాధురి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసా



అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సాగును సంబరంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తోంది. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. సజావుగా సేద్యం చేసుకునేందుకు పకడ్బందీగా సేవలందిస్తోంది. అందులో భాగంగా ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందజేస్తోంది. సకాలంలో ఎరువులు.. పురుగు మందులను పంపిణీ చేస్తోంది. భూసార పరీక్షలు చేయించి, అధిక దిగుబడి సాధించేలా దిశానిర్దేశం చేస్తోంది. పండించిన పంటలను గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయిస్తోంది. వ్యవసాయాన్ని పండుగలా మార్చడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తోంది.

- అందుబాటులో ఆర్బీకేలు
- సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ
- కియోస్క్ ద్వారా డిజిటల్ సాయం
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు
- సాగుకు అవసరమైన సలహాలు

మండలం: నాయుడుపేట	
మొత్తం ఆర్బీకేలు	12
ఆర్బీకేల పరిధిలో గ్రామాల సంఖ్య	33
సేవలు పొందుతున్న రైతులు	4,465
పంపిణీ చేసిన ఎరువులుబ	2,070 మెట్రిక్ టన్నులు
విత్తనాలు	3,174 క్వింటాళ్లు
రైతు గ్రూపుల సంఖ్య	12
సభ్యులు	60
పంపిణీ చేసిన ట్రాక్టర్లు	6
వ్యవసాయ పరికరాలు	90

నాయుడుపేట: రైతు సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారు. అన్నదాతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 2020 మే 30వ తేదీన గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. రైతు తన స్వగ్రామంలోనే ఆర్బీకేల ద్వారా సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలను రవాణా సమస్యల లేకుండా ఎమ్మార్పీ ధరకే కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఏ పంట సాగు చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ఆర్‌బీకే సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి తగు సలహాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మండలంలో ప్రధాన పంటగా వరి, మెట్ట ప్రాంతాల్లో వేరుశనగ అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తారు. వ్యవసాయం బోర్లు, బావులు, చెరువులు, నది పరివాహక ప్రాంతల్లో రబీలో 10,500 ఎకరాలు, ఖరీఫ్‌లో 5,500 ఎకరాలు రైతులు సాగు చేస్తారు.

క్షేత్రస్థాయిలో సేవలు ఇలా..

ఆర్బీకేల్లో డిజిటల్ ఆధారిత సేవలు అందుబాటులో ఉన్నాయి. మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌ల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తున్నారు. ఆర్బీకేల్లో సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్నారు. సీఎం యాప్ ద్వారా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. భూసారపరీక్షలు చేయిస్తున్నారు. పొలంబడి ద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ముఖ్యంగా పంట కోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పించేలా రైతు భరోసా మాసపత్రికను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఒకే చోట వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది

రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధకశాఖ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో అన్ని రకాల సేవలు రైతులకు ఒకే చోట అందుతున్నాయి. గతంలో ఎలాంటి సహాయం కావల్సి వచ్చినా, సలహాలు అవసరమైనా రైతులు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు అన్నిశాఖల సిబ్బంది రైతుభరోసా కేంద్రాల్లో ఉండడంతో సకాలంలో సేవలు అందుతున్నాయి.

పెట్టుబడి వ్యయం తగ్గింది



రైతులకు సేవలు చేరువయ్యాయి. గతంలో మా సాగు సామగ్రి కోసం నాయుడుపేట పట్టణానికి వెళ్లేవారం. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఇంటి ముంగిటకే అందజేస్తోంది. దీంతో మాకు రవాణా ఖర్చులు తగ్గాయి. పంటల సాగుకు పెట్టుబడి వ్యయం తగ్గింది. – శ్రీనివాసులు, రైతు, భీమవరం

అర్హులందరికీ న్యాయం



నేడు పంట నష్టం జరిగితే వెంటనే పరిహారం అందుతోంది. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగితే ప్రత్యేక బృందాలంటూ వచ్చి పోయేవారు. ఒకే చోటే ఉండి సిఫార్సులపై పేర్లు నమోదు చేసుకుని వెళ్లేవారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేది కాదు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం జరుగుతోంది. – తుంగా వీరయ్య, రైతు, తుమ్మూరు

అన్ని సేవలు అందిస్తున్నాం



మండలంలోని రైతులందరికీ అన్ని సేవలు అందిస్తున్నాం. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూస్తున్నాం. పంటల నమోదు, బీమా, యాంత్రీకీకరణకు అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉంచాం. గ్రూపుల ద్వారా సబ్సిడీలు అందించాం. అర్హులైన ప్రతి రైతుకూ ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. –గణేష్ , ఏఓ , నాయుడుపేట

జగన్నాథ రథయాత్ర ట్రయల్ రన్



జగన్నాథ రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

గూడూరు: పట్టణంలో ఇస్కాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో నిర్వహించనున్న 6వ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నామని, ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇస్కాన్ ప్రతినిధి సుఖదేవ తెలిపారు. జగన్నాథ రథయాత్ర సందర్భంగా ముందుగా రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించి, లోటుపాట్లను తెలుసుకుని వాటిని సరిచేసుకుని 24వ తేదీన నిర్వహించే జగన్నాథ రథయాత్ర సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. స్థానిక నారాయణమ్మ పేరంటాలు దేవస్థానం నుంచి ప్రారంభమైన ట్రయల్ రన్ పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు రాజశేఖర్, రాజా, గిరి, తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపిక. చిత్రంలో కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లించాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ శ్రీనివాసరావు సారథ్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో రూపొందించిన మునిరత్నంనగర్ (మాలయకోట)లో శిథిలావస్థలో ఉన్న కోనేరు అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.25 లక్షలతో నిధులు మంజూరు చేయడంతో 2021లో పనులు పూర్తి చేశారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఆ బిల్లుల చెల్లింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులందరూ కలిసి కట్టుగా ఉంటూ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, ఆర్ఐ షాజహాన్, వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, పాపాడి చంద్రారెడ్డి, అశోక్‌కుమార్, షేక్ షబ్బీర్, గోపాలయ్య, సరితా, సుమ, మౌనిక, కోఆప్షన్ సభ్యురాలు షేక్ జరీనా, తదితరురలు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

చిల్లకూరు: మండలంలో చుక్కల భూముల పేరుతో ప్రభుత్వం నిషేధిత భూములుగా రికార్డుల్లో నమోదైన వాటికి విముక్తి లభించందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎన్నో ఏళ్లుగా రికార్డుల్లో నిషేధిత భూములుగా ఉన్న వాటి రికార్డులను సరి చేసి ఆ భూములను సంబంధిత రైతులకు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. వీటిని శుక్రవారం రోజు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలతో పాటు గూడూరు ఆర్డీఓ చేతుల మీదుగా అందజేశామని చెప్పారు.

దౌర్జన్యం చేస్తున్నారు

తాను 30 ఏళ్ల కింట కొనుగోలు చేసిన భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పొన్నవోలు గ్రామానికి చెందిన గుంటపూడి ఆదిశేషయ్య గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నవోలు సర్వే నెంబర్ 69-1-21లో ఎకరా భూమిని అదే గ్రామానికి చెందిన పసల సుందరయ్య అనే వ్యక్తి వద్ద 30 ఏళ్ల కిందట కొనుగోలు చేశానని చెప్పారు. అయితే ఇటీవల సుందరయ్య కుమారుడు విజయ పొలంలోకి దిగన్వికుండా దౌర్జన్యం చేస్తున్నారని, దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, గృహసారథులు కృషి చేయాలని ఎంపీడీఓ గోపీనాద్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆయన మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు అందించిన ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు చేరిందా? లేదా అన్న విషయాలను తెలుసుకునేందుకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, సంయుక్తంగా గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి ఆ కుటుంబానికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాయి, ఇంకా అర్హత ఉండి అందని పథకాలను తెలుసుకుని వాటిని సత్వరమే అందించేలా చూడాలన్నారు. ఈఓపీఆర్డీ మాణిక్యం, ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు ముస్లిం కాలనీకి చెందిన ఎస్‌కే మస్తాన్ గుండెపోటుతో మరణించడంతో అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అతని భార్య ఫాతిమాకు గురువారం అందజేశారు. సచివాలయ సిబ్బంది కృష్ణ, వలంటీర్ మమత, ఆ వార్డు కౌన్సిలర్ బీ మహేష్, కృష్ణ బలిజ పూసల సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



అవినాష్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం దయాకర్‌రావు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దయాకర్‌రావు అన్నారు. పాఠశాల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారని, ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదువుకోవాలన్న లక్ష్యంతో ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫామ్ తదితర సామగ్రి అందజేసి ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన అవినాష్, చరణ్, చైతన్యను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు అభినందనలు

చిల్లకూరు: మండలస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన చింతవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థినులను గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ బుధవారం జరిగిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఈ లేఖ, డీ ధరణి ప్రథమస్థానంలో నిలిచి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులందరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

విద్యకు అగ్రస్థానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అగ్రస్థానం ఇచ్చి, విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. మండలంలోని పుదూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో గురువారం జరిగిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. పదో తరగతిలో అత్యధికగా మార్కులు సాధించిన కే ప్రసన్న, పీ మంజుభార్గవి, కే స్పందనకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోమలాదేవి, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ కే రూల్ రోమాల, వైస్ ప్రిన్సిపల్ పద్మజ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గూడూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడి సతీమణి రమాదేవి(36) రెండు రోజుల క్రితం స్పృ తప్పి, అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

ఆక్రమణలను తొలగిస్తాం



డక్కిలి: మండలంలోని కొత్తనాలపాడు చెరువుకు సంబంధించి ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని కొత్తనాలపాడు చెరువు, వివాదస్పదంగా మారిన సర్వే నంబర్ 102 -5లో ఉన్న 5.60 ఎకరాలభూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 102-5లో ఉన్న భూమికి సంబంధించి గ్రామస్తులు, పాతనాలపాడుకు చెందిన ఓ వ్యక్తికి మధ్య వివాదం నడుస్తున్న నేపథ్యంలో రికార్డుల ఆధారంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోగులతో సఖ్యతగా మెలగాలి



వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీఓ

గూడూరు: ఆస్పత్రికి వచ్చే రోగులతో సిబ్బంది సఖ్యతగా ఉంటూ వారికి వైద్యసేవలు అందించాలని, ప్రతి నెలా ఆస్పత్రి పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గురువారం ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రోగులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బందితో మాట్లాడడం జరిగిందన్నారు. రోగులతో సఖ్యతగా ఉంటూ వారికి సమాచారాన్ని తెలియజేసి, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతినెలా హాస్పిటల్ పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న వసుమతి

రాపూరు: మండలంలోని కంబాలపల్లె, కుమ్మరిగుంట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్‌లను గురువారం డీఎల్‌డీఓ వసుమతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కంబాలపల్లెలో రెండు లేఅవుట్‌లగాను 46 మంది లబ్ధిదారులు, కుమ్మరిగుంటలో 49 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని, వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. అనంతరం కంబాలపల్లె, శానాయిపాళెం సచివాలయలను తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ రామకృష్ణ ఉన్నారు.

పరిహారం చెల్లింపులో న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నిర్వాశితులు

పెళ్లకూరు: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లింపులో న్యాయం చేయాలని పలువురు బాధితులు గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కగారిపేట గ్రామం సర్వే నంబర్ 497లో భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారం మరొకరి ఖాతాలో జమ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉదయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జగ్గయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అంతకుముందు పట్టణంలోని కట్టెలవీధి, బెస్తపాళెం వద్ద ఉన్న వీధి సందుదారి సమస్యను ఆ వార్డు కౌన్సిలర్, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబుతో కలిసి స్థానికులతో చర్చించి పరిష్కరించారు. కమిష నర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానికులు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

సేవలకు సిద్ధం

ప్రారంభానికి ముస్తాబైన నూతన భవనాలు



ప్రారంభానికి ముస్తాబైన కోట సచివాలయం-1

కోట: మండలంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం నిర్మిస్తున్న నూతన భవనాలు సేవలకు సిద్ధమవుతున్నాయి. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల కోసం నూతన భవనాలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఆయా కార్యాలయాలకు సంబంధించిన నూతన భవనాల పనులు పూర్తి కావచ్చాయి. ఆ భవనాలు ప్రాంభానికి ముస్తాబవుతున్నాయి. కోట దాదరాయిగుంటలో మూడు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. రూ.40 లక్షల వ్యయంతో సచివాలయం-1 భవనం రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా త్వరలో భవనాలను ప్రారంభిస్తామని ఎంపీడీఓ భవానీ తెలిపారు.